పోలింగ్ వరకు పకడ్బందీగా ఉందాం

- మరింత సమన్వయంతో పని చేద్దాం
- చెక్ పోస్టుల వద్ద మరింత అప్రమత్తత అవసరం
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సిఎస్‌ల భేటీలో నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు మరింత సమన్వయంతో పని చేయాలని తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ నిర్ణయించాయి. అంతర్రాష్ట్ర ఎన్నికలు, సంబంధిత అంశాలపై సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణా రాష్ట్ర సచివాలయంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, డిజిపి రవి గుప్తా, అడిషనల్ డిజిలు శివధర్ రెడ్డి, మహేష్ భగవత్, ఎపి అడిషనల్ డిజి డాక్టర్ శంకబ్రత బాగ్చి, ఎపి వాణిజ్య పన్నులు, ఎక్సయిజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ, తెలంగాణా పిసిసిఎఫ్ ఆర్ఎం దొబ్రియెల్, ఎపి పిసిసిఎఫ్ చిరంజీవి చౌదరిలు తదితరులు హాజరయ్యారు.

అంతర్రాష్ట్ర ఎన్నికలు, సంబంధిత అంశాలపై చర్చిస్తున్న తెలుగు రాష్ట్రాల సిఎస్‌లు

ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ, మే 13న జరిగే పోలింగ్‌ను సక్రమంగా నిర్వహించేందుకు ఇప్పటికే సరిహద్దు రాష్ట్రాల పరిధిలోని జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. అక్రమ మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టే వివిధ వస్తువుల రవాణాతో పాటు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేసినట్టు చెప్పారు. శాంతి భద్రతల పరిస్థితి కూడా పూర్తిగా అదుపులో ఉందని, ఇదే రకమైన వాతావరణాన్ని పోలింగ్ వరకు మరింత పకడ్బందీగా కొనసాగించేందుకు ప్రస్తుత సమావేశం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. గోవా, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులు రాకుండా ఆయా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న చెక్-పోస్టుల్లో మరింత అప్రమత్తత అవసరమని అన్నారు. ఇప్పటికే, రాష్ట్ర పోలీస్ శాఖ ద్వారా 36 అంతరాష్ట్ర చెక్-పోస్టులు, అటవీ శాఖకు సంబంధించి మూడు అంతరాష్ట్ర చెక్-పోస్టులు, ఎక్సైజ్ శాఖ ద్వారా ఎనిమిది, 224 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, వాణిజ్య పన్నుల ద్వారా 7 చెక్-పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలపాటు పటిష్టమైన గస్తీని ఏర్పాటు చేశామని వివరించారు. తెలంగాణలో తీవ్రవాద ప్రాబల్యం లేదని, ఛత్తీస్‌ఘడ్ నుంచి మావోయిస్టుల కార్యకలాపాలు జరగకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు, కేంద్ర పోలీస్ బలగాల మధ్య పటిష్టమైన సమన్వయంతో పని చేస్తున్నట్టు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ సిఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ శాసనసభ, లోక్‌సభ స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నందున, వాటిని ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా తెలంగాణాతో పూర్తిస్థాయి సమన్వయంతో పని చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి మాదక ద్రవ్యాలు, గుడంబా నిరోధానికిగాను ఆపరేషన్ పరివర్తన పేరుతో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫాలితాలనిచ్చిందని చెప్పారు. ఎపికి ఉన్న వివిధ రాష్ట్ర సరిహద్దుల్లో పలు శాఖల ద్వారా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమ మద్యం రవాణా, డబ్బు పంపిణీ, వివిధ వస్తువుల రవాణాను కట్టుదిట్టటంగా అడ్డుకుంటున్నామని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మంచి సమన్వయంతో పని చేస్తున్నాయని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన ఏపూరి సోమన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న సోమవారం కాంగ్రెస్‌లో చేశారు. మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో సోమవారం తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏపూరి సోమన్న షర్మిల స్థాపించిన వైఎస్‌ఆర్‌టిపిలో చేరి.. తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగి తెలంగాణ శాసనసభ ఎన్నికల ముందు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏపూరి సోమన్నకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వంద స్టోర్లకు విస్తరించిన హెర్‌జాప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వినికిడి సంరక్షణ పరిష్కారాలను అందించే హెర్‌జాప్ తమ 100వ స్టోర్‌ను జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసింది. దీన్ని సిమెన్స్ హియరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ మాజీ సిఇఒ ఎస్‌కె శర్మ, హెర్‌జాప్ వ్యవస్థాపకులు, ఎండి రాజా ఎస్‌తో కలిసి ప్రారంభించారు. వచ్చే రెండేళ్లలో 250 స్టోర్‌లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాజా తెలిపారు. భవిష్యత్తులో 500 స్టోర్స్‌ను చేరాలని నిర్దేశించుకున్నామన్నారు. తద్వారా వినికిడి ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వినియోగదారులకు సమగ్రమైన, ఇంటరాక్టివ్ విధానాన్ని అందించడానికి తమ స్టోర్లు రూపొందించబడ్డాయన్నారు.

లాసెట్ దరఖాస్తు గడువుపొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 25 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారంతో ముగియనుండగా దాన్ని ఈనెల 25 వరకు పొడిగించామని తెలిపారు. జూన్ మూడో తేదీన లాసెట్ రాతపరీక్షలుంటాయని వివరించారు. ఇతర వివరాలకు https://lawcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

22న కెఆర్ఎంబి భేటీ

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

కృష్ణానది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) ప్రత్యేక సమావేశం ఈ నెల 22న జరగనుంది. ఇది వర్చువల్ మోడ్‌లో నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని జలసౌధలో ఉదయం 11 గంటలకు ఈ జరిగే సమావేశంలో కేవలం కెఆర్ఎంబి ఆర్థిక పరిస్థితులపై చర్చించనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధికారులు హాజరవనున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ఆమోదంతోపాటు నిధుల కోసం చర్చించనున్నటు కెఆర్ఎంబి సభ్యకార్యదర్శి డిఎం రాయిపురే సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏం చేశావని ఓట్లడుగుతున్నవ్ మోడీ..?

- దేవుణ్ని రాజకీయ రొంపిలోకి లాగడం దుర్మార్గం
- రాష్ట్రంలో బిజెపిని ఓడించాల్సిందే : ఎస్ వీరయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

పదేండ్ల కాలంలో దేశ ప్రజలకు మోడీ సర్కార్ చేసిన పని గుర్తు చేసి, ఓట్లడిగే స్థితి లేదనీ, ఏ ఒక్క వాగ్దానం అమలు చేయలేదనీ, ప్రజలకు ఏం చెప్పి ఓట్లడగాలో అర్థం గాక..దేవుణ్ని అడ్డం పెటుకుని ఓట్లడిగే దుస్థితికి బిజెపి దిగజారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో' బిజెపిని ఓడిద్దాం-నియంతృత్వ ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నర్సింహారావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్, ఎం మహేందర్, ఎం వెంకటేశ్, ఎం దశరథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ అన్ని గెలుస్తాం, ఇన్ని గెలుస్తామంటూ బిజెపి నేడు అడ్రస్ లేని లెక్కలు చెబుతూ ప్రజలను గందరగోళం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఏ మేరకు అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. చెప్పుకోవటానికి ఏమీ లేక.. ప్రజల మధ్య చిచ్చు పెట్టి, విద్వేషాలు రగిలించి ఓట్లు దండుకునేందుకు వారు కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయనీ, పేదరికం, దరిద్ర్యం, నిరుద్యోగం ఎన్నడూ లేని పద్ధతుల్లో పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిజి నర్సింహారావు, ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ కంటోన్‌మెంట్ బోర్డు ఏరియాలో కారుణ్య నియమకాలు చేపట్టలేదనీ, ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలను కూడా చేపట్టలేని ధైన్యంలో బిజెపి ఉందని చెప్పారు. ఇక్కడే ఈ పరిస్థితి ఉంటే..ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిర్వాహకం వల్ల తాగు నీటికి కూడా మీటర్లు పెట్టే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ పరిధిలో పోటీలో ఉన్న బిజెపి అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు.

21న టిఎస్ఆర్‌జెసి సెట్

- హాల్‌టికెట్ల డౌన్ లోడ్‌కు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ నడుపుతున్న 35 గురుకుల జూనియర్ కాలేజీల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే టిఎస్ఆర్‌జెసి సెట్ రాతపరీక్ష ఈనెల 21వ (ఆదివారం) తేదీన జరగనుంది. ఈ మేరకు ఆ సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంగ్లీష్ మీడియంలో ఎంపిసి, బైపిసి, ఎంఇసిలో 35 జూనియర్ కాలేజీల్లో ప్రవేశం కోసం పదో తరగతి పరీక్షలకు రాష్ట్రంలోని 73,527 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. http: //tsr-jdc.cgg.gv.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో ఈనెల 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాతపరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నిజాయితీ, క్రమశిక్షణ కలిగిన రాజీవ్ రతన్

- సంస్మరణ సభలో సీనియర్ ఐపిఎస్‌లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజాయితీ, క్రమశిక్షణ కలిగిన ఐపిఎస్ అధికారి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిపి రాజీవ్ రతన్ అని సీనియర్ ఐపిఎస్ అధికారులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రాజీవ్‌రతన్ సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ మాట్లాడుతూ.. రాజీవ్ రతన్ ఇంత ఆకస్మికంగా మరణిస్తారని తాను ఊహించలేదనీ, ఆయన ఐపిఎస్ అధికారిగా పోలీసు శాఖ ద్వారా ప్రజలకందించన సేవలు ఎన్నటికీ మరవలేమని అన్నారు. ముఖ్యంగా, పోలీసు శాఖలోని ఏ విభాగంలో పని చేసినా.. ఆ విభాగం పనితీరును మెరుగుపర్చటానికి పలు సంస్కరణలు తీసుకొచ్చారని ఆయన తెలిపారు. చివరిగా, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా కాళేశ్వరంను సందర్శించి, అక్కడ ఎలాంటి అవకతవకలు జరిగాయనే విషయమై ప్రభుత్వానికి నివేదికను సమర్పించారని ఆయన అన్నారు. జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. రాజీవ్ రతన్ నిజాయితీ, చిత్తశుద్ధి కలిగిన అధికారే గాక.. తాను విధి నిర్వహణ చేస్తున్న విభాగానికి వంద శాతం న్యాయం చేకూర్చే అధికారిగా కొనియాడారు.పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. రమేశ్ మాట్లాడుతూ.. గతంలో ఈ విభాగం ఎండీగా పని చేసిన రాజీవ్ రతన్ పలు నిర్మాణాలను చేపట్టి ప్రభుత్వానికి ఆర్థిక దుబారా లేకుండా అనేక జాగ్రత్తలు తీసుకున్నారని ఆయన అన్నారు. ఈ విభాగంలో పని చేసిన ఇంజనీర్లకు చక్కటి దిశానిర్దేశం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ పోలీసు అధికారులతో పాటు పోలీస్ హౌఋసింగ్ కార్పొరేషన్‌కు చెందిన అధికారులు, సిబ్బంది రాజీవ్ రతన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మద్దతు ధర కోసం ధాన్యం రైతుల ఆందోళన

- గన్నీ బ్యాగులు తగలబెట్టి నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరసన తెలుపుతున్న రైతన్నలు

జనగామ జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మద్దతు ధర కరువైంది. మార్కెట్ యార్డులో ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదని రైతులు నాలుగు రోజుల కిందట నిర్వహించిన ఆందోళనపై సిఎం సీరియస్‌గా స్పందించి, రైతుల వద్ద మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ నాలుగు రోజుల సెలవుల అనంతరం సోమవారం ప్రారంభమైన మార్కెట్ యార్డులో ఎలాంటి మార్పు రాలేదు. దాంతో ఆగ్రహించిన రైతులు మార్కెట్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట గన్నీ బ్యాగులు తగలబెట్టి నిరసనకు దిగారు. అక్కడికి వచ్చిన జిల్లా మార్కెటింగ్ అధికారిని అడ్డుకొని రైతులు వాగ్వివాదానికి దిగారు. అధికారులు సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా రైతులు ఆందోళన అలాగే కొనసాగించారు. మార్కెట్ యార్డుకు జిల్లా కలెక్టర్ రావాలని, రైతులు తెచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చివరికి జనగామ ఆర్‌డిఒ దేవరాయ కొమురయ్య వచ్చి ధాన్యంకు మద్దతు ధర కల్పిస్తామని హామీనివ్వడంతో రైతులు శాంతించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధాన్యంను మద్దతు ధరకు కొనుగోలు చేయకుంటే మళ్లీ నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. యాసంగి ధాన్యాన్ని మార్కెట్ యార్డులో మార్చి 6వ తేదీ నుండి వ్యాపారస్తులు కొనుగోలు ప్రారంభించారు. అప్పటినుంచి ఏప్రిల్ 13వరకు జనగామ మార్కెట్ యార్డ్‌లో 1407 మంది రైతుల వద్ద నుంచి 61930.10 క్వింటాళ్ల ధాన్యాన్ని క్వింటాకు రూ. 1500 నుంచి రూ.1800 వరకు ధర చెల్లించి వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. ఆరుగాలం కష్టపడ్డా రైతుకు క్వింటాకు ధర సరాసరి రూ.1700 కూడా దాటకపోవడం గమనార్హం. దాంతో నాలుగు రోజుల క్రితం మార్కెట్ యార్డులో రైతులు మద్దతు ధర కోసం ఆందోళన చేశారు.

PUBLIC NOTICE

The public in general hereby informed that my clients Mr. Karim Hirani and Mrs. Nadia Karim Hirani have entered into agreement of sale in respect of flat No. C-203/39 & C-204/40 second Floor, C-Block Bearing municipal No. 5-8-42 fatch sultan Lane, Nampally Station Road, Hyderabad. known as Nandanam Apartments with its Original owner and possessor Mr. Sada Shiv Sawrikar and paid earnest amount to the owner as such any body has got any sort of claim or objection may approach to my office with in 7 days along with documents if any, there after no claim will be entertain and my client will proceed with the sale transactions.

MIRZA SULEMAN BAIG
ADVOCATE & ASSOCIATES
#12. 3rd Floor. Sanali Mall Complex,Opp. Chermas,Grammar School, Abids, Hyderabad-500 001.
9701122343

ఎన్నికల చౌరస్తాలో 'రైతు'

- పోటాపోటీగా కాంగ్రెస్, బిజెపి దీక్షలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పంటలేయడం..రక్షించుకోవడం కోసం అప్పులు తేవడంకోత కోయడం..ఆపైన మార్కెట్‌లో తిప్పలు పడటం..'మద్దతు' దక్కక అడ్డికి పావుసేరుకు అమ్ముకోవడం..తినీతినక మిగిలిన దాంట్లో ఎంతో కొంత అప్పు తీర్చడం...మళ్లీ కొంత పంట వేయటం కోసం సన్నద్ధం కావడం..అన్నదాతల కాలచక్రం ఇదే. ప్రతి ఏటా జరిగే తంతు ఇదే. పార్టీ ఏదైనా ఎన్నికల ముందు వాగ్దానాలే తప్ప ఏలుబడిలో వారికి చేసిందేమీలేదు. ఈ తంతు మారిందీ లేదు. కాగా, తాజా సార్వత్రికంలో రాజకీయ నేతలు తమ లబ్ధి కోసం మరోసారి ఎన్నికల చౌరస్తాలో అన్నదాతలను నిలబెట్టారు. రైతుల కష్టాలను తీర్చిందేమీ లేకపోగా, వాటిని తమకు అనుకూలంగా మలుచుకుని ఓట్లుగా మార్చుకునే పనిలో పార్టీలు పడ్డాయి. అన్నదాతకు అసలు కారణలేంటో అర్థం కాకుండా ఈ పరిస్థితులకు మీరంటే మీరే కారణమంటూ విమర్శనాస్త్రాలను ఎక్కువపెట్టి లబ్ధిపొందే వేటలో పడ్డాయి. ఎండిన పంటలను బిఆర్ఎస్ నేతలు హైలెట్ చేస్తూ 'కాంగ్రెస్ వచ్చింది..కరువొచ్చింది' అంటూ ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో చేసిన తప్పిదాలను కాంగ్రెస్ నేతలు ఎత్తిచూపుతున్నారు. తామొచ్చి నాలుగు నెలలే అవుతున్నదనీ, భూగర్భజలాలు అంతకంటే ముందే పడిపోయాయని చెప్పేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో దీక్షపెట్టి రైతులకు కేంద్ర ప్రభుత్వం ఏవిధంగా నష్టం చేకూరుస్తున్నదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు మూడు నల్లచట్టాలను కేంద్రం తెస్తున్నదనీ, ఎమ్ఎస్‌పి ధర అడిగితే ఇవ్వట్లేదనీ, చట్టాల రద్దు, ఎమ్ఎస్‌పి కోసం ఢిల్లీ పురవీధుల్లో పోరుబాట పట్టిన అన్నదాతలపై కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. 700 మందికిపైగా అన్నదాతలను పొట్టన బెట్టుకున్న తీరును ఎండగడుతున్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పోటాపోటీగా రైతు కేంద్రంగా చేస్తున్న ఆందోళనతో ఉలిక్కి పడ్డ బిజెపి నేతలు తామేమీ తక్కువ కాదన్నట్టుగా అన్నదాతల పల్లవి ఎత్తుకున్నారు. డిసెంబర్ 9న చేస్తానన్న రూ. రెండు లక్షల రుణమాఫీ, రైతులకు, కౌలు రైతులకు పంట సహాయం కింద ఇస్తామన్న రూ.15 వేలు ఏమయ్యాయంటూ ప్రశ్నించడం మొదలుపెట్టారు. బిఆర్ఎస్ నేతల వల్లే క్షేత్రస్థాయిలోకి మాత్రం వెళ్లడం లేదు. ఎన్నికల వేళ రైతుల ఆగ్రహం తమ పుట్టి ముంచుతుందని గ్రహించారో ఏమోగానీ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే సోమవారం రైతుదీక్ష నిర్వహించారు. ఆ దీక్ష ఎన్నికల షోను తలపించింది. ఆ దీక్షలో పట్టుమనీ పది మంది రైతులు కూడా కనిపించలేదు. హడావిడి అంతా ఆ పార్టీ కార్యకర్తలదే. కంకులు పోసి, కోతకొచ్చిన మూడు వరిపైర్ల కట్టలు తెచ్చి అక్కడ షో చేయడంపై విమర్శలొచ్చాయి. కిసాన్ సెల్ నాయకులు, అడ్వకేట్లే ఎక్కువగా కనిపించారు. మొక్కుబడిగా యాదాద్రి జిల్లా బొమ్మల రామారం మండలం హాజీపూర్ నుంచి కొందరు మహిళలను, వృద్ధులను తీసుకొచ్చి దీక్షలో కూర్చోబెట్టారు.

గంజాయి, డ్రగ్స్ ... యువత భవిష్యత్ చిత్తు

- గుట్టుగా రవాణా.. విక్రయాలు
- చెక్‌పోస్టుల కళ్లు కప్పి కర్ణాటక, మహారాష్ట్రకు రవాణా
- ఉమ్మడి మెదక్ జిల్లాలో సాగు తగ్గినా రవాణా సాగుతునే ఉంది
- మూత పడిన పరిశ్రమల్లో డ్రగ్స్ తయారీ అడ్డాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి మెదక్ జిల్లాలో గంజాయి సాగు తగ్గినా రవాణా యధేచ్ఛగా సాగుతోంది. చెక్ పోస్టుల కండ్లు కప్పి అడ్డదారుల్లో పక్క రాష్ట్రాలకు రవాణా అవుతోంది. స్థానికంగా యువత, విద్యార్థులు, వలస కార్మికులే టార్గెట్‌గా విక్రయాలు సాగిస్తున్నారు. పారిశ్రామిక వాడల్లో డ్రగ్స్ తయారీ అడ్డాలు పెరుగుతున్నాయి. ఇటు పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుని అటు పక్క ఉన్న రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్న ముఠాలు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లు చేసి స్థానికంగా విక్రయిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మూడు నెలల కాలంలో గంజాయి రవాణా చేస్తూ విక్రయిస్తూ పట్టుపడిన సంఘటల్లో 30 కేసులు నమోదయ్యాయి. సుమారు కోటి రూపాయల విలువ చేసే గంజాయిని పోలీసులు స్వాధినం చేసుకున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 30 కేసులు 41 మంది అరెస్టు

ఉమ్మడి మెదక్ జిల్లాలో గంజాయి మత్తు పదార్థాన్ని రవాణా చేస్తూ పట్టుపడిన సంఘటనల్లో 2024 జనవరి నుంచి మార్చి 31 వరకు 30 కేసులు నమోదయ్యాయి. 41 మందిని పోలీసులు అరెస్టు చేశారు. 400 కిలోల మేర ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సుమారు కోటి రూపాయల విలువ చేసే గంజాయి పట్టుపడిందంటే పట్టుపడని మత్తు పదార్థం ఎన్ని కోట్ల వ్యాపారం సాగిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలో 24 కేసులు నమోదు కాగా 34 మంది అరెస్టు అయ్యారు. పట్టుపడిన గంజాయి విలువ రూ.96 లక్షలుంటుందని పోలీసులు అంచనా వేశారు. మెదక్ జిల్లాలో మూడు కేసులు, నలుగురు అరెస్టు కాగా సిద్దిపేట జిల్లాలో మూడు కేసుల్లో ముగ్గురు అరెస్టు అయ్యారు.

విద్యార్థులు, యువత, వలస కార్మికులే టార్గెట్

యువత, విద్యార్థులు, వలస కార్మికుల్ని టార్గెట్ చేసుకుని గంజాయి మత్తును ఎరగా వేస్తూ వ్యాపారం సాగిస్తున్నారు. కళాశాలలుంటే ప్రాంతాల్లో చిన్న చిన్న కొట్లల్లో గంజాయి విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, కంది, సదాశివపేట, హత్నూర, పటాన్‌చెరు, పాశమైలారం, జిన్నారం, గుమ్మడిదల, సిద్దిపేట జిల్లాలోని కొండపాక, దుద్దెడ, నారాయణరావుపేట, అక్కన్నపేట వంటి ప్రాంతాల్లో గంజాయిని చిన్న ప్యాకెట్లలో పెట్టి విక్రయిస్తూ పట్టాపడిన సంఘటనలు ఉన్నాయి. సదాశివపేట మండలంలోని తంగెడుపల్లి గ్రామంలో జొన్న చేనులో గంజాయి మొక్కలు పెంచిన సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు ఆ మొక్కలను ధ్వంసం చేశారు. పటాన్‌చెరు, సంగారెడ్డి, సిద్దిపేట వంటి ప్రాంతాల్లో ఉన్న ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, ఐటీ కళాశాలల విద్యార్థులకు గంజాయి మత్తును అలవాటు చేస్తున్నారు. స్థానికంగా చిన్న చిన్న దుకాణాల్లో సైతం సరుకు లభిస్తుండటడంతో విద్యార్థులు మత్తుకు బానిసవుతున్న పరిస్థితి ఉంది. అదే విధంగా యువత సైతం గంజాయికి అలవాటు పడి భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారు. పారిశ్రామిక వాడల్లో వలస కార్మికులు గుట్కా, ఇతర పాన్ మసాలాలు అధికంగా తింటారు. దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు ఇక్కడకు వలసొచ్చి ఆయా కంపెనీల్లో పనిచేస్తున్నారు. అదే విధంగా నిర్మాణ రంగం, ఇతర పనుల్లోనూ ఉంటున్నారు. వీరికి సైతం గంజాయిని అలవాటు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

చెక్‌పోస్టుల దాడుతున్న గంజాయి

లపటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్ మీదుగా ముంబయి జాతీయ రహదారిపై అనేక చోట్ల టోల్‌గేట్స్, రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టులున్నాయి. అక్కడ నిరంతరం తనిఖీలు చేస్తున్నా గంజాయి రవాణా మాత్రం సాగుతూనే ఉంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా నుంచి దిగుమతి చేసుకుంటూ హైదరాబాద్, సంగారెడ్డి మీదుగా కర్నాటక, మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారు. చిరాగ్‌పల్లి, మాడ్డి, మనియార్‌పల్లి, సిద్ధాపూర్ తండ, హుపల్లి, షాపూర్ చౌరస్తాలో చెక్‌పోస్టులున్నాయి. మునిపల్లి మండలంలోని కంకోల్ వద్ద టోల్‌గేట్ ఉంది. అయినా ఇటీవల కంకోల్ టోల్‌గేట్ వద్ద పెద్ద ఎత్తున ఎండు గంజాయి పట్టుపడిందంటే రవాణా యధేచ్ఛగా సాగుతుందనే చెప్పాలి. ఎక్సైజ్, పోలీసుల తనిఖీల్లో సరుకు పట్టుబడుతున్నా ఇంకా గుట్టుగా రవాణా సాగుతునే ఉంది.

మూత పడిన పరిశ్రమల్లో డ్రగ్స్ తయారీ

మూతపడిన పరిశ్రమలు, సీజ్ ఇండస్ట్రీస్ డ్రగ్స్ తయారీకి అడ్డాలుగా మారాయి. ఆ ప్రాంతాలకు వెళ్లేందుకు రోడ్లు సరిగ్గా ఉండవు. భయంకరమైన వాతావరణంలో పరిశ్రమలుంటాయి. ఇప్పటి వరకు అధికారుల దాడుల్లో డ్రగ్స్ తయారీ చేస్తూ పట్టుబడిన అడ్డాలన్నీ పాత పరిశ్రమలే కావడం విశేషం. పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో మూతపడిన పరిశ్రమల్లో డ్రగ్స్ తయారు చేస్తూ పట్టుపడ్డారు. అధికారులు ఆరు చోట్ల దాడులు చేసి డ్రగ్స్ తయారీ కేంద్రాలను గుర్తించగా అందులో మూడు చోట్ల ఆ పరిశ్రమలకు కనీసం బోర్డు, వివరాలు కూడా లేవు. డ్రగ్స్ తయారు చేస్తూ పట్టుబడిన వాళ్లల్లో ఎక్కువ మంది గతంలో రసాయన పరిశ్రమల్లో పని చేసిన అనుభవమున్న వాళ్లుగా పోలీసులు గుర్తించారు. 2016 నుంచి 2023 వరకు పట్టుపడిన డ్రగ్స్ తయారీదారుల్లో రసాయనాల పట్ల అవగాహన ఉన్న వాళ్లే ఉన్నారు. పరిశ్రమల్లో నిషేధిత ఆల్ఫోజోమ్, మిడైల్ మేడ్ కాతినోస్, మెప్కెడిన్ 2023 డిసెంబర్‌లో రూ.మూడు కోట్ల విలువ చేసే డ్రగ్ తయారీలో వాడే మత్తు మందును పట్టుకున్నారు. 2024 మార్చిలో 90.48 కిలోల వివో పౌడర్ పట్టుపడింది దీని విలువ రూ.8.99 కోట్లు ఉంటుందని అధికారులు గుర్తించారు సెంట్రల్ టాస్కపోర్స్, యాంటీ నార్కోటిక్ టీమ్స్, లోకల్ పోలీసులు జరిపిన దాడుల్లో సుమారు రూ.100 కోట్ల విలువ చేసే నిషేధిత డ్రగ్స్ పట్టుపడింది.

మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెంచాం: రూపేష్, జిల్లా ఎస్‌పి

గంజాయి, ఇతర డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల రవాణా, తయారీపై నిఘా పెంచాం. అనేక ప్రాంతాల్లో దాడులు చేసి డ్రగ్స్ తయారీ ముఠాల్ని అరెస్టు చేశాం. ఇంటెలిజెన్స్ విభాగం సమాచారంతో అంతరాష్ట్ర సరిహద్దులు దాటుతూ గంజాయిని రవాణా చేస్తున్న ముఠాల గుట్టును రట్టు చేయగలుగుతున్నాం. మరింత పటిష్టవంతంగా నిఘా, తనిఖీలను పెంచుతాం.

యువత భవిష్యత్ పాడవుతుంది: అనిల్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, సంగారెడ్డి

గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువత భవిష్యతను పాడు చేసుకుంటుంది. గంజాయి చిన్న చిన్న ప్యాకెట్లల్లో లభిస్తుంది. ఇతర పాన్ మసాల ప్యాకెట్ల పేరిట గంజాయిని విక్రయిస్తున్నారు. మూతపడిన పరిశ్రమల్లో ప్రమాదకరమైన డ్రగ్స్‌ను తయారు చేస్తున్నారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు పోలీసులు, ఇంటెలిజెన్స్, యాంటీ నార్కోటిక్ బృందాలు, టాస్క్‌ఫోర్స్ టీమ్స్ సంగారెడ్డి జిల్లాపై ప్రత్యేక నిఘా పెట్టి వీటిని అరికట్టాలి.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS (DISTRICT REGISTRAR) KURNOOL.
ARB. CLAIM PETITION No. 131/2023.

Between:-
M/s. Kapil Chits Hyderadad Pvt. Ltd., Rept. by its Legal Officer .... **Disputant**

And

R. PARWATHI & Others ...**Opponents**

1. R.Parwathi, W/o.R.Seshulu,Hindu Aged about 52years, Occ:House wife, R/o. H.No.23-41, Near Old Bus Stand, Alampur, Mahaboob Nagar, Dist. T.S.,
2. Kodumuru Neeraja,W/o.K.Narasimhulu, Hindu Aged about 53years, Occ: Private Employee, R/o. H.No.7-43/23, Srinivasa Colony, Mahaboob Nagar City & Dist. T.S.,

NOTICE TO OPPONENTS No. 1 TO 2

WHEREAS the Disputant Chit Fund Company, in the above Dispute has instituted the above Dispute for recovery of money and the same is posted for your appearance in the said Court on the 30-04-2024 by 11:00 a.m. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparte.

// By the Order of the Deputy Registrar of Chits O/o. District Registrar Stamps & Registrations Dept. Kurnool //.

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
O.P NO.370/2019

BETWEEN:
Pinniti Rajamma. ......Petitioner.
AND:
G.Sai Prasad and 2 others. ......Respondents

NOTICE TO THE 1st RESPONDENT

R.1:- G. Sai Prasad, S/o G.Hanmandulu, driver of the Private Bus bearing No. AP 16 TU 9899, Residing at D.No.6-88/69, Egasanjeev Reddy House, Sanjeev Reddy Nagar Colony, Borgaom (P), Nizamabad District.

Please take notice that the above matter stands posted to 30.04.2024 for the appearance of the 1st respondent before the Honourable Court of the Motor Accident Claims Tribunal cum Additional District Judge at Vizianagaram by 10.30 a.m. If you fail to appear before the said Honourable court by **10.30 a.m., on 30.04.2024** in person or through an advocate, the above matter will be decided in your absence and ex parte.

CH.Damodar Rama Mohana Rao(Damu)
Advocate for the petitioner
Pradeepnagar, Vizianagaram-53500
Cell No: 9393328926
Cell No: 9052648232

మతాన్ని పావుగా వాడుకుంటున్న బిజెపి

- ఆ పార్టీ ఓటమే లక్ష్యం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం, మళ్లీ అధికారం చేజిక్కించుకునేందుకు బిజెపి మతం పేరుతో ప్రజల్లో అసమానతలను సృష్టిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని పిఎస్ఆర్ గార్డెన్స్‌లో సిపిఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశం సోమవారం పొదిళ్ల చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ వీరయ్య మాట్లాడుతూ పదేళ్లుగా దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించి పాలనను గాలికొదిలేసిందని విమర్శించారు. అధికారమే పరమావధిగా ప్రతిపక్ష పార్టీలను, నాయకులను అణగదొక్కుతూ.. ఈడీ దాడులతో భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు.

రైతుల సంక్షేమం, గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం

విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

చేశారు. పెట్టుబడిదారీ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు, రైతులను కూలీలుగా మార్చేందుకు యత్నిస్తున్నదని ఆరోపించారు. బిజెపి పాపాల పుట్టను కదిలించేందుకే ఇండియా కూటమి ఏర్పడిందని తెలిపారు. మత ఛాందసవాదాన్ని తుద ముట్టించేందుకే అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వస్తున్నాయని చెప్పారు.

దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడా బిజెపి ప్రాబల్యం లేదన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లోనూ ఆ పార్టీ పట్ల ప్రజలు విరక్తితో ఉన్నారని చెప్పారు. వీటన్నింటి నుంచి గట్టెక్కేందుకు రాముడు, రామ మందిరం, మతం రంగుతో ప్రజలను ఆకట్టుకునేందుకు యత్నిస్తోందని విమర్శించారు. 400 సీట్లు వస్తాయంటూ.. రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్నారని, మనువాదాన్ని అమలు చేసేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న చట్టాలకు బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తూ అంబానీ, అదానీలకు వంతపాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా బిజెపిని ఓడించాలని బిజెపియేతర పార్టీలన్నీ ఏకతాటిపైకొచ్చి కూటమిగా ఏర్పడుతుంటే.. రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ సోయి లేకుండా వ్యవహరిస్తుందని విమర్శించారు.

రాష్ట్రంలో మాజీ సిఎం కెసిఆర్ కుమార్తె కవితను జైల్లో పెట్టిన బిజెపిని ఓడించేందుకు సన్నద్ధం కావాలే తప్ప ప్రస్తుత ప్రభుత్వాన్ని పడగొడతామని అనడం సరికాదన్నారు. కాంగ్రెస్ కలిసొచ్చినా.. రాకున్నా బిజెపి ఓటమే లక్ష్యంగా సిపిఎం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, మండల కార్యదర్శి తీగల ఆగిరెడ్డి, నాయకులు బీరెడ్డి సాంబశివ, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు రత్నం రాజేందర్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి దావూద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

రేగడిపల్లిలో తాగునీటి ఎద్దడి

- ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోజురోజుకూ ఎండలు మండుతుండటంతో ఇప్పటికే జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలో భూగర్భ జలాలు 450 అడుగులు లోతుకు అడుగంటాయి. సాగు నీటి ఇబ్బందులే కాకుండా తాగునీటి ఇబ్బందులు సైతం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని మల్హర్ మండలం తాడిచెర్లలోని రేగడిపల్లిలో నాలుగైదు రోజులుగా తాగునీరు కరువువయింది. విసిగి వేసారిన స్థానికులు సోమవారం ఖాళీ బిందెలతో తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ.. స్థానిక అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ప్రజల దాహార్తి తీర్చాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని 8వ వార్డులో ఉన్న బోర్‌లో భూగర్భ జలాలు తగ్గడంతో నీరు తక్కువగా పోస్తోందని చెప్పారు. దీనికి తోడు మిషన్ భగీరథ పైప్ లైన్ సైతం వార్డులో వేయకపోవడంతో తాగునీటికి కటకటగా ఉంది. దాంతో నీరులేక మూడు రోజులకోసారి స్నానం చేస్తున్నట్టు వాపోయారు. గొంతు తడుపుకునేందుకు వ్యవసాయ, సమీప వార్డుల్లో బోర్ మోటార్ల వద్దకు పరుగులు తీస్తున్నామని చెప్పారు. సమీప బోర్ బావుల వద్దకు నీటి కోసం వెళ్తే సదరు రైతులు ఇక్కడికి రావొద్దంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేదంటే ఎంపీడీఓ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

26 మంది మావోయిస్టులు లొంగుబాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సౌత్ బస్తర్ దంతెవాడ జిల్లాలో 26 మంది మావోయిస్టులు సిఆర్‌పిఎఫ్ డిఐజి వికాస్ కతేరియా, ఎస్‌పి గౌరవ్ రాయ్ ఎదుట సోమవారం లొంగిపోయారు. 'లోన్ వరాటు' (ఇంటికి తిరిగి రండి) ప్రచారానికి ఆకర్షితులై లొంగిపోయినట్టు వారు తెలిపారు. వీరంతా బంద్ సందర్భంగా రోడ్లను తవ్వడం, చెట్లను నరికివేయడం, బ్యానర్లు, పోస్టర్లు వేయడం వంటి ఘటనల్లో పాల్గొనేవారు. లొంగిపోవడంలో ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ఆర్‌ఎఫ్‌బి రేంజ్ సిఆర్‌పిఎఫ్ 111వ, 195వ కార్ప్స్, 231వ కార్ప్స్ ప్రత్యేక సహకారం అందించాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస పథకం కింద రూ.25 వేల ప్రోత్సాహక నగదుతో పాటు అన్ని రకాల ప్రయోజనాలను దంతెవాడ పోలీసు సూపరింటెండెంట్ అందజేస్తారు. 'లోన్ వరాటు' ప్రచారం కింద, ఇప్పటివరకు 176 రివార్డ్ మావోయిస్టులతో సహా మొత్తం 717 మంది లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్టు పోలీసులు తెలిపారు.

సిఆర్‌పిఎఫ్‌కు లొంగిపోయిన మావోయిస్టులు

రైల్ నిలయంలో అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్ ధనంజయులు, గౌరవ అతిథిగా ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ పి కిషోర్ బాబు హాజరయ్యారు. ఇందులో వివిధ విభాగాలకు చెందిన ప్రధాన అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు సిబ్బంది, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి సంఘాలతోపాటు గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నుంచి సీనియర్ నాయకులు వచ్చారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ ధనంజయులు మాట్లాడుతూ భారతీయులను విద్యా, సామాజిక సంస్కరణల ద్వారా వారిలోని పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయడం, ప్రేరేపించడం బాబాసాహెచ్ గొప్పతనమన్నారు. పి కిషోర్ బాబు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి దృఢత్వానికి, ప్రతిభకు, అచంచలమైన అంకితభావానికి గొప్ప నిదర్శనమన్నారు.

రోడ్డు ప్రమాదంలో బిటెక్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతివేగం వల్ల కారు అదుపు తప్పి ఓ విగ్రహ దిమ్మెను ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన మేఘాంశ్(20) అల్వాల్‌లోని బంధువుల ఇంట్లో దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి పరిధిలోని మహీంద్రా విశ్వవిద్యాలయంలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి తన నిస్సాన్- ఎక్స్ కారులో స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి తన స్నేహితులు ఎ.ఎస్. అర్నవ్, సాయి మానస్, శ్రీచరణ్ రెడ్డితో కలిసి దుండిగల్ గ్రామం సుందర్ చైతన్య ఆశ్రమం రోడ్డు వైపు వెళ్లారు. ఈ క్రమంలో కారు నడుపుతున్న సాయి మానస్ అతివేగంగా వెళ్లడంతో ఓఆర్ఆర్ సమీపంలోని జ్యోతిరావు ఫూలే దిమ్మెను ఢీకొట్టారు. దాంతో మేఘాంశ్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. ఒకరిని యశోద ఆస్పత్రికి తరలించగా, మరో ఇద్దరిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అర్నవ్ పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్టు తెలిసింది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మద్యం మత్తులో ః వల్లే ప్రమాదం జరిగినట్టు తెలుస్తున్నది.

ప్రజా సమస్యలపై పోరాడుతున్న జహంగీర్‌ను గెలిపించండి

- ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పజెబుతున్న బిజెపి
- ఇరిగేషన్ సమస్య వల్ల భువనగిరి వెనుకబడింది
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యలపై అవగాహన ఉండి.. నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె ఎండి జహంగీర్‌తో కలిసి మాట్లాడారు. విద్యార్థి సంఘం నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై పోరాడుతున్న జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలంతా ఆదరించి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేయాలన్నారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఎన్నో హామీలను ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి పేద ప్రజలపై అధిక భారాలు మోపుతోందన్నారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కమ్యూనిస్టు భావజాలంతో నీతి నిజాయితీ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి, పక్కన ఎండి జహంగీర్ తదితరులు

నిబద్ధతతో పనిచేసే జహంగీర్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

అభ్యర్థి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై తనకు మాత్రమే అవగాహన ఉందని, ఇతర పార్టీల అభ్యర్థులు ప్రజలకే తెలియదని అన్నారు. తనకు ఓటేసి పార్లమెంట్‌కు పంపించాలని ప్రజలను కోరారు. తుంగతుర్తి గడ్డ తెలంగాణ సాయుధ పోరాటాలకు కేంద్ర బిందువు అని, రజాకార్లను గడగడలాడించిన ప్రాంతమని చెప్పారు. కమ్యూనిస్టులకు పదవులు అంటే పోరాట ఆయుధమని అన్నారు. భువనగిరి నియోజకవర్గ పరిధిలో ఇరిగేషన్ సమస్య కీలకంగా ఉందని, సాగు, తాగు నీరు, వైద్యంపై పాలకుల నిర్లక్ష్యం వల్ల వెనుకబడిందని చెప్పారు. గతంలో మల్లు స్వరాజ్యం ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తుంగతుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారని.. ఇప్పటి వరకు డిగ్రీ కళాశాల ఏర్పాటు కాలేదని చెప్పారు. ప్రధాన పార్టీల నాయకులు డబ్బు సంచులతో ఎన్నికల బరిలో నిలిచారే తప్ప కనీసం పార్లమెంటు సరిహద్దులు కూడా తెలియదన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న తనను గెలిపిస్తే పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. వందరోజుల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. గత ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా ఎన్నో హామీలు ఇచ్చి విస్మరించారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, మట్టిపెల్లి సైదులు, చేరుకు ఏకలక్ష్మి తదితరులు ఉన్నారు.

మోడీ ప్రభుత్వ అప్రకటిత ఎమర్జెన్సీ

- ఆర్థిక, సామాజిక రాజకీయ విశ్లేషకులు పాపారావు
- "అలుపెరగని పోరాటం" పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాటి ఎమర్జెన్సీ నుంచి నేటి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రకటిత ఎమర్జెన్సీ వరకు వివిధ అంశాలను 'అలుపెరుగని పోరాటం' పుస్తకంలో పొందుపరిచారని ఆర్థిక, సామాజిక రాజకీయ విశ్లేషకులు పాపారావు అన్నారు. ప్రముఖ పాత్రికేయుడు, న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ రచించిన 'అలుపెరగని పోరాటం' పుస్తకాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. నవతెలంగాణ బుక్ హౌస్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. సిపిఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ, నవతెలంగాణ బుక్ హౌజ్ మేనేజర్ వాసు, టి సాయి శేషగిరిరావు, ప్రబీర్ పురకాయస్థ సహచరులు అంబేద్కర్, సృజన ఆధ్వర్యంలో కామ్రేడ్ జితిన్ అధ్యక్షతన హైదరాబాద్ మధురానగర్‌లోని సిపిఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పుస్తకాన్ని పాపారావు ఆవిష్కరించి నాయకులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యూస్ క్లిక్ యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజా సమస్యలు, కార్మిక సమస్యలు ప్రజలందరికీ తెలియజేసిన గొప్ప వ్యక్తి ప్రబీర్ పురకాయస్థ అన్నారు. ఈ పుస్తకంలో ప్రజా సమస్యలను పేర్కొన్నారని.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నిస్తే ఇడి, సిబిఐలతో దాడులు చేయించి జైలుకు పంపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష

అలుపెరగని పోరాటం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పాపారావు

నాయకులను ఎన్నికల సమయంలో జైల్లో పెట్టడం అంటే వారిని పోటీలో లేకుండా చేసి తాను లబ్ధిపొందడానికి యత్నిస్తోందని విమర్శించారు. ఇది ఎమర్జెన్సీ కిందికే వస్తుందని తెలిపారు. న్యూస్ క్లిక్ యూట్యూబ్ ఛానల్‌పై అనేక రకాల దాడులు చేసి జర్నలిస్టుల ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు తీసుకెళ్లారని గుర్తు చేశారు. దేశంలో ప్రస్తుతం మీడియా మొత్తం ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి చేతిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపర్తి అశోక్, సిహెచ్ చంద్రశేఖరరావు, జె స్వామి, జి బిక్షపతి, జి హనుమంతురావు, నీలి పాపారావు, సి శ్రీనివాస్, బాలు, రమణ, ప్రసాద్, కుమార్, పుల్లయ్య పాల్గొన్నారు.

బిజెపిని ఓడిస్తేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది

- అభివృద్ధి చేయకుండా.. మత రాజకీయాలు చేస్తున్న మోడీ
- సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ శక్తులతో జతకట్టిన మోడీ ప్రభుత్వాన్ని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓడిస్తేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలగుతామని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు గొల్లపల్లి జయరాజు, జలాలుద్దీన్ అన్నారు. సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యాలయం కెకె భవన్‌లో సోమవారం నిర్వహించిన సిపిఎం, సిపిఐ జిల్లా సదస్సులో వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏం లేకనే మతరాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మతోన్మాద కార్పొరేట్ విధానాల వల్ల బిజెపి పట్ల దేశ వ్యాప్తంగా వ్యతిరేకత పెరిగిందన్నారు. బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకికవాదం, సమాఖ్య వ్యవస్థలకు పెనుప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేండ్లలో ప్రభుత్వ అండతో దేశ, విదేశీ బడా కార్పొరేట్లు లక్షల కోట్ల రూపాయలను కొల్లగొట్టాయని, అంతకు పదిరేట్ల వరకు బిజెపి ఎన్నికల బాండ్లు తదితర రూపాల్లో కుంభకోణాలకు పాల్పడిందన్నారు.

ఈ విషయాలను ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. చివరికి మీడియాను సైతం బెదిరించి తన గుప్పిట్లో పెట్టుకుందని, ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఎన్నికల బాండ్లను మొదటి నుంచీ కమ్యూనిస్టు పార్టీలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయన్నారు. ఈ

సిపిఎం, సిపిఐ జిల్లా సదస్సులో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

విషయంలో సుప్రీంకోర్టు కలుగచేసుకొని.. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యానికి ఎన్నికల బాండ్లు విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. ధరలు, నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. గతంలో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాడారని గుర్తు చేశారు. పదేండ్ల మోడీ పాలన అప్రకటిత ఎమర్జెన్సీని, నయా ఫాసిజాన్ని తలపిస్తోందన్నారు.

ప్రజాస్వామ్యం కలిగిన మన దేశంలో పీకల్లోతు అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన నియంతృత్వ బిజెపి పాలనకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నాయకులు మల్లేశం, రాజయ్య, మాణిక్, నర్సింలు, యాదగిరి, అశోక్, కృష్ణ, రమేష్, మహేష్, సంతోష్, సురేష్, సిపిఐ నాయకులు రహమాన్, ఆనంద్, తాజుద్దీన్ మహబూబ్ ఖాన్, లక్ష్మీ, రుబిన, శంకరప్ప, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి రాష్ట్రానికిచ్చింది కేలండర్లు, చిత్రపటాలేనా?

- తెలంగాణకు ఏం చేసింది
- 'పాలమూరు- రంగారెడ్డి'కి జాతీయ హోదా హామీ ఏమైంది?
- రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణకు బిజెపి చేసిందేమీ లేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని గత ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ హామీ ఇచ్చి విస్మరించారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో క్యాలెండర్లు, చిత్రపటాలు, చీరలు పంచుతున్నారు" అని మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో సోమవారం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి మధ్య తరగతి ప్రజల డొక్కలు ఎండబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ, నవోదయ పాఠశాల మంజూరు చేయలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో బిజెపి నేతలకు చెప్పుకోవడానికి పథకాలు లేవు కనుక క్యాలెండర్లు, చిత్రపటాలు, చీరలు, బ్యాగులు పంచుతున్నారని ఎద్దేవా చేశారు.

కరివేనా రిజర్వాయర్ పూర్తయిందని, కాలువలు తవ్వితే కొడంగల్ నియోజకవర్గంలోని లక్ష 20 వేల ఎకరాలకు సాగునీరు అందించొచ్చని చెప్పారు. దీనికి సంబంధించిన టెండర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలు, 13 హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని, మొదటి సంతకం ఆరు గ్యారంటీలపైనే చేసి అసెంబ్లీలో చట్టబద్ధత కల్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ చేసిందని ప్రశ్నించారు. రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, ధాన్యాన్ని రూ. 2500 కొంటామని, వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే లోపే రూ. 15000 తమ ఖాతాలో జమవుతాయని చెప్పి విస్మరించారని అన్నారు. పింఛన్లు రూ.4000కు

ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పెంచుతామని, ప్రభుత్వ ఉద్యోగులులాగా ఆడబిడ్డలకు ప్రతి నెలా ఒకటో తేదీనే రూ.2500, నిరుద్యోగ భృతి రూ.నాలుగు వేల హామీలు అమలుకు నోచుకోలేదన్నారు.కెసిఆర్ కిట్లు బంద్ అయ్యాయని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 90 వేల కోట్లతో సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్ అందించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 24 గంటల విద్యుత్ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హకీంపేట, నల్లచెర్ల, ఎంకేపల్లి గ్రామాలలో ఫార్మాసిటీ కోసం రైతుల భూములను లాక్కుంటే ఊరుకునేది లేదని, తమ కార్యకర్తలపై కేసులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ రూపురేఖలు మారుతాయని ఓట్లు వేసి రేవంత్‌ను గెలిపించారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కొడంగల్‌లో 50 వేల మెజారిటీ వస్తేనే రూ.5000 కోట్లు మంజూరు చేస్తానని, మెడికల్, ఇంజనీరింగ్, ఫార్మాసిటీ కళాశాలు ప్రారంభమవుతాయని చెప్పడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు ఎస్.రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన అధికారులు

- పలు జిల్లాల్లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవినీతికి పాల్పడిన అధికారులను ఎసిబి అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన ఘటనలు హన్మకొండ, ఆసిఫాబాద్, నల్లగొండ జిల్లాల్లో సోమవారం చోటుచేసుకున్నాయి. బాధితులు, ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రవీందర్.. హుజూరాబాద్ డిపోలో బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కాగా, ఫిబ్రవరి 12న రవీందర్ మేనబావ కుమారుడు హేమంత్ ప్రమాదవశాత్తు యాక్సిడెంట్‌లో చనిపోగా ఆరోజు రవీందర్ డ్యూటీకి వెళ్ళలేదు. దాంతో డిపో మేనేజర్ శ్రీకాంత్ చార్జ్ మెమో ఇచ్చారు. దాన్ని ఎత్తివేయడానికి రూ.30వేలు లంచం అడగగా రవీందర్ రూ.పది వేలు ఇచ్చాడు. మిగతా డబ్బుల కోసం డిపో మేనేజర్ డిమాండ్ చేయగా.. విసుగు చెందిన రవీందర్ ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం ప్రయివేటు హోటల్‌లో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను రెడ్ హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి ఎసిబి కోర్టుకు శ్రీకాంత్‌ను తరలించినట్టు డిఎస్‌పి తెలిపారు. ఆయన వెంట సిఐలు శ్యాంసుందర్, రాజు, సిబ్బంది ఉన్నారు.

కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాలో కేంద్ర పోలీస్‌స్టేషన్ మహిళా ఎస్ఐ రాజ్యలక్ష్మి.. రోడ్డు ప్రమాద కేసులో కారు యజమాని నుంచి రూ.25

లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 31న మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ వస్తున్న క్రమంలో బూరుగుడ ప్రధాన రహదారిపై మద్యం తాగి ఉన్న ఇరువురూ ద్విచక్ర వాహనంపై వస్తూ ఓ కారును ఢీకొట్టారు. కారులో ఉన్న బాధితుడు యహీయా ఖాన్ వెంటనే 108, 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. అదే రోజు బాధితుడు జిల్లా కేంద్ర పోలీస్‌స్టేషన్‌లో పిటిషన్ ఇవ్వడానికి ప్రయత్నించగా తీసుకోలేదు. తెల్లవారి మళ్లీ వచ్చి ఎస్ఐ రాజ్యలక్ష్మిని సంప్రదించగా లోక్ అదాలత్‌లో కేసు కొట్టి వేసేలా సెక్షన్లు వేస్తామని, రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితుడు ఏప్రిల్ 4న ఒకసారి, తిరిగి ఆదివారం స్టేషన్‌కు మరోసారి రాగా రూ.25 వేలు ఇవ్వమని ఎస్ఐ అడిగారు. బాధితుడు వెంటనే ఎసిబి అధికారులకు సమాచారం అందించగా.. డబ్బులు ఇచ్చే క్రమంలో ఎస్ఐని ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని ఎసిబి కోర్టుకు అప్పగించినట్టు ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి తెలిపారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని నూకల వెంకట చారిటబుల్ ఆస్పత్రిలో మెడికల్ షాప్ అనుమతి కోసం గత నెల చిట్టెపు సైదిరెడ్డి దరఖాస్తు చేసుకున్నాడు. మెడికల్ షాప్ అనుమతివ్వాలంటే రూ.20వేలు చెల్లించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్ డిమాండ్ చేయగా, బేరమాడి రూ.18 వేలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సోమవారం షాపు యజమాని సైదిరెడ్డి ఎసిబి అధికారులను ఆశ్రయించగా, వారి సూచన మేరకు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్‌కు రూ.18 వేలు ఇస్తుండగా తన కార్యాలయంలోనే ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.